జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్గొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

శనివారం 12 సెప్టెంబర్ 2026 పేజీలు:15





## జపాన్‌లో రాజశేఖర్ ప్రతిభకు గుర్తింపు

**గరిడేపల్లి,సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**

జపాన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటనలో గరిడేపల్లికి చెందిన ఉపాధ్యాయుడు,వ్యక్తిత్వ వికాస నిపుణుడు చారుగుండ్ల రాజశేఖర్ ప్రతిభకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

వివరాలు 2లో

# రెవెన్యూ సేవల్లో వేగం పెంచాలి

**- ఆధునిక సాంకేతికతతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం- ప్రజావాణి,భూభారతి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట కలెక్టరేట్ సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లాలో రెవెన్యూ సేవలను మరింత వేగవంతం చేసి ప్రజలకు సత్వర న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. భూసమస్యల పరిష్కారంలో పారదర్శకతతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి రెవెన్యూ అధికారులతో వెబెక్స్ ద్వారా భూభారతి, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

మిగతా 2 లో

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



**- సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు**

**- అన్నారం గ్రామంలో ఘనంగా ఎస్జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు - ఖోఖో క్రీడలను ప్రారంభించిన అతిథులు**

**తుంగతుర్తి, సెప్టెంబర్ 11, (ప్రజాజ్యోతి);**

చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, చదువుకు అవసరమైన జ్ఞానం, ఆలోచన శక్తి నీ క్రీడలు పెంపొందిస్తాయని తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాసరెడ్డి,మలిపెద్ది శ్రీనివాస్ రెడ్డి, కార్తీక్ రెడ్డి దాతల సహకారంతో నిర్వహించిన ఎస్జిఎఫ్ మండల స్థాయి ఖోఖో క్రీడలకు సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు.



మిగతా 2 లో



# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి: సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు

మొదటిపేజీ తరువాయి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి టోర్నమెంట్స్ అనేవి గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ప్రాథమిక పునాదిగా నిలుస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తూ జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.





మండల స్థాయిలో నిర్వహించే క్రీడలు క్రీడాకారులకు పునాది లాంటిదన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరు కాగా అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగంలో ఖోఖో టోర్నమెంటులో ఎంపిక పోటీలు నిర్వహించారు. ముందుగా క్రీడల దిగ్గజం ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత రాణి జ్యోతి ప్రజ్వలన చేయగా జాతీయ జెండాను మండల విద్యాధికారి బోయిని లింగయ్య, కామన్వెల్త్ గేమ్స్ జెండాను గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి, ఎస్జిఎఫ్ జెండాను ప్రధానోపాధ్యాయురాలు సునీత రాణి ఆవిష్కరించగా క్రీడా జ్యోతిని అతిథులు వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం వివిధ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు చేసిన మార్చి ఫాస్ట్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చలపతి,తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఎస్జిఎఫ్ జిల్లా సెక్రటరీ మంద కిరణ్ కుమార్, నియోజకవర్గ సెక్రటరీ యాదగిరి,తుంగతుర్తి మండల కన్వీనర్ కొండగడుపుల యాకయ్య, గ్రామ ఉపసర్పంచ్ వెలిశాల సునీత, గ్రామ పాలకవర్గం సభ్యులు,మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు,వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సేవల్లో వేగం పెంచాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా చేపడుతున్న గ్రామ సర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. తహసీల్దార్లు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి వారం పురోగతి నివేదికలు అందించాలని ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు అధునాతన సాంకేతికత, కృత్రిమ మేధస్సు, డిజిటల్ పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. గతంలో గంటల సమయం పట్టే నివేదికలు, ముసాయిదా తయారీ వంటి పనులను సాంకేతికత సహాయంతో తక్కువ సమయంలో నాణ్యతతో పూర్తి చేయవచ్చని తెలిపారు. దీనివల్ల అధికారుల పనిభారం తగ్గడంతో పాటు ప్రజలకు సేవలు వేగంగా అందుతాయన్నారు.



## భూసమస్యలపై ప్రత్యేక దృష్టి

మండలాల వారీగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన భూసమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులతో పాటు 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న భూభారతి కేసులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో సమస్యల తీవ్రతను తగ్గించి, ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన రెవెన్యూ సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జపాన్‌లో రాజశేఖర్ ప్రతిభకు గుర్తింపు

మొదటిపేజీ తరువాయి

ఆయన సమర్పించిన రీసెర్చ్ పేపర్ ప్రజెంటేషన్‌ను ప్రశంసిస్తూ జపాన్ అంతర్జాతీయ విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఆఖావో ప్రశంసా పత్రం అందజేశారు.తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ నేతృత్వంలో సెప్టెంబర్ 5 నుంచి 12 వరకు జరిగిన ఈ పర్యటనలో 29 మంది ఉపాధ్యాయులు,విద్యా నిపుణులు పాల్గొన్నారు.జపాన్ ఆధునిక విద్యావిధానం, రోబోటిక్స్,సాంకేతిక విద్య తదితర అంశాలను బృందం అధ్యయనం చేసింది. రాజ శేఖర్‌కు ప్రశంసా పత్రం లభించడంపై పలువురు విద్యావేత్తలు,ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

**కేతేపల్లి, సెప్టెంబర్ 11: ప్రజా జ్యోతి**

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కేతేపల్లి మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేతేపల్లి తహసీల్దార్ (ఎమ్మార్వో)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కేతేపల్లి మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ మాట్లాడుతూ.. నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించడంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని, ఈ చారిత్రక ఘట్టం గురించి తెలంగాణ సమాజానికి అవగాహన కల్పించాలని కోరారు. విమోచన దినోత్సవాన్ని ఇతర పేర్లతో నిర్వహించకుండా, తెలంగాణ విమోచన దినోత్సవంగానే నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు అయితగోని అనిత, యానాల శంకర్ రెడ్డి, జిల్లా నాయకులు తాడోజు నరసింహాచారి, యానాల శ్రీనివాస్ రెడ్డి, సమ్మెట విజయలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు వీరబోయిన పాల నాగయ్య, మండల ప్రధాన కార్యదర్శులు ఇరగదిండ్ల పద్మ, తోవిటి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# గురజాల గ్రామంలో గ్రామ సభ

**శాలిగౌరారం: సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి**

నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎర్ర రోజా సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను గ్రామ వార్డు సభ్యులు, ప్రజలకు వివరించారు. సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి గ్రామంలో జరిగిన ఆదాయ, వ్యయ వివరాలను గ్రామ సభలో ప్రజలకు వెల్లడించారు. అలాగే గ్రామంలో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిపై చర్చించారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకన్న, ఉప సర్పంచ్ ముత్యాల ఉపేందర్, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి వివిధ హోదాల్లో ఉన్న ఉద్యోగులు, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





# 18, 19 తేదీల్లో జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలు

## - హామీలు కాదు.. ఇండ్ల స్థలాలు కేటాయించాలి: జర్నలిస్టులు





**నల్గొండ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఐజెయు నల్గొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు గార్లపాటి కృష్ణా రెడ్డి , ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి తెలిపారు . ఈ నెల 18 ,19 తేదీలలో నిర్వహించే ఈ రిలే దీక్షలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు . జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలనే డిమాండ్‌తో ఈ నెల 18, 19 తేదీల్లో నల్గొండ కలెక్టరేట్ ఎదుట రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఐజెయునల్గొండ జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ దీక్షల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సంఘం జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డిలు జర్నలిస్ట్ లతో కలిసి నల్గొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డికి శుక్రవారం ఒక అధికారిక వినతిపత్రాన్ని సమర్పించారు. జర్నలిస్టుల చిరకాల ఆకాంక్ష అయిన ఇండ్ల స్థలాల సాధన కోసం శాంతియుత పద్ధతిలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని, కాబట్టి ఈ రెండు రోజుల దీక్షలకు తగిన అనుమతులు మంజూరు చేయాలని వారు తమ లేఖలో కోరారు. ఈ సందర్భంగా టి.యు.డబ్ల్యు.జె. – ఐజెయు నల్గొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు గార్లపాటి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్ట్ ఇళ్లు , ఇళ్ల స్థలాల కోసం ఎన్ని సార్లు ధర్నా లు , ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు , ప్రజా ప్రతినిధులు తాత్కాలిక హామీ లు తప్ప తమ సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు . ఈ నెల 18 ,19 తేదీలలో నిర్వహించే ఈ రిలే దీక్షలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు . ఈ కార్యక్రమం లో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు పరమేష్, ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్ ,చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బోజు మదనాచారి, కోశాధికారి. అశోక్ . వీడియో జర్నలిస్ట్ ల సంఘం అధ్యక్షులు సలీం మరియు నాయకులు జిల్లా యాదయ్య,పి. అశోక్ కుమార్, వంగాల శ్రీనివాస్ రెడ్డి ,సయ్యద్, కె.జగదీశ్వర చారి,చింత యాదయ్య , రామ్ ప్రసాద్ , రెడ్డి పల్లి యాదగిరి , రెమిడాల మధు , ముచ్చర్ల విజయ్ , కారింగు శ్రీనివాస్ , దశరథ , సాగర్ ,, లింగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు .

# ఉపాధి కూలీలకోసం 5ఏళ్ల కు గాను పనుల ప్రణాళికలు సిద్ధం చేయండి..!

## -ఎంపిడిఓ వెంకటయ్య

## వికసిత్ గ్రామీణ్ ప్రిపరేషన్ పై అవగాహనా సదస్సు

**దామరచర్ల, సెప్టెంబర్ 11, (ప్రజాజ్యోతి):**




వచ్చే ఐదేళ్లకు గాను ఉపాధి కూలీలకు చేతినిండా పనులు కల్పించేలా 318 రకాల పనుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.వెంకటయ్య కోరారు. మండల పరిధిలో వికసిత్ గ్రామీణ్ ప్రిపరేషన్ ప్లాన్ సంబంధించి మండల స్థాయి అవగాహన కార్యక్రమం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలో అన్ని గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్స్ పాల్గొనగా రాబోయే నాలుగు,ఐదు సంవత్సరాలకు సంబంధించి సంవత్సరం వారిగా వి బి జి రామ్ జి పథకంలో వి జి పి పి గ్రామ్ పంచాయతీ ప్రిపరేషన్ ప్లాన్ సంబంధించి 318 రకాల పనులను గ్రామసభల ద్వారా గుర్తించి ప్లాన్ లో పొందుపరచవలసిందిగా వారిని కోరారు. ప్రణాళికలో భాగంగా కూలి లకు సరిపడా మెటీరియల్,సరిపడా పనులను గుర్తించి, చేపట్టె పనుల ప్రణాళిక చేపట్టవలసిందిగా వారిని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడంతోపాటు, గ్రామాలు అభివృద్ధి జరిగేలా, కూలీలకు ఉపాధి లభించేలా పనుల ఎంపిక విధానం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సూపరింటిండెంట్ జి. ఎస్.మూర్తి, ఎం ఇ ఓ సైదా నాయక్, ఎం ఏ ఓ, ఎ ఇ పి ఆర్, ఏ ఇ ఆర్ డబ్ల్యు ఎస్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బానోతు సాగర్ నాయక్

## - విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా



**తుంగతుర్తి, సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి):**

నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ ఎస్ యు ఐ) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అడ్వకేట్ బానోతు సాగర్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది.ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్న బానోతు సాగర్ నాయక్ గతంలో నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యార్థుల సమస్యలు, విద్యా రంగానికి సంబంధించిన అంశాలు, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్ర పోషించారు.విద్యార్థి నాయకుడిగా ఆయన అందించిన సేవలు, నాయకత్వ అనుభవాన్ని గుర్తించిన ఎన్ఎస్‌యూఐ జాతీయ, రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించింది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థి సమస్యలపై మరింత విస్తృతంగా పనిచేసే అవకాశం ఆయనకు లభించింది.ఈ సందర్భంగా బానోతు సాగర్ నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించిన ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జకార్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ స్వామితో పాటు జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా రంగంలో ఎదురవుతున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ విద్యార్థులకు అండగా నిలుస్తానని బానోతు సాగర్ నాయక్ పేర్కొన్నారు.సాగర్ నాయక్ నియామకంపై పలువురు విద్యార్థి నాయకులు, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, న్యాయవాదులు, ఆయన సన్నిహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో విద్యార్థి సమస్యలపై మరింత చురుకైన కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

# మట్టి వినాయక విగ్రహాల తయారీలో ఏవీఎం విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడే శ్రేష్ఠం

**నల్లగొండ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్ పట్టణంలోని ఏవీఎం ఇంగ్లీష్ హైస్కూల్‌లో విద్యార్థులు ఈకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ కమిటీగా ఏర్పడి వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు.విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాల యాలకు పంపిణీ చేశారు.మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని, ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలని విద్యార్థులు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలు ఎంతో శ్రేష్ఠమైనవని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కందాల స్వప్న శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు



# అన్ని దానాలలోకెల్లా అన్నదానం గొప్పది

## - యామా సంతోష్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**

అమావాస్య తిథి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వద్ద వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి104ఏ రీజియన్ 5 ఆర్సీ యామా సంతోష్,అఖిలభారత అయ్యప్ప దీక్ష సమితి, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ, శ్రీభానుపురి సేవా బృందం ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నారు.అన్ని దానాల కన్నా అన్నదానమెంతో గొప్పదని అన్నారు.అన్నదానంతో ఇతరుల కడుపు నింపడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని తెలిపారు.ఎన్నో వేల జన్మలకు గాని మానవ జన్మ ప్రాప్తించదని, అటువంటి జన్మనిచ్చిన మన పూర్వీకులను గుర్తుంచుకుని ప్రార్థించాలని పేర్కొన్నారు.అమావాస్య తిథి రోజున పితృ దేవతలకు పూజలు చేసి, వారిని స్మరించుకోవడం అన్ని విధాలుగా శుభాలను చేకూరుస్తుందని అన్నారు. ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి దాతల సహకారం మరువలేనిదని అన్నారు.ఈ కార్యక్రమంలో గుండా శ్రీధర్, కలకోట లక్ష్మయ్య, పబ్బతి వేణుమాధవ్, చిల్ప అజయ్,తేరిటిపల్లి సతీష్, బెలిదే ముకుందం, శ్రీరంగం రాము, దాతలు సతీష్, ఊర రామకృష్ణ,గెల్లీ అంజన్, చల్లా శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ పోరాటం ఆదర్శం

## - సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

**గరిడేపల్లి,సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి):**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శ మని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. పొనుగోడులో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట 80వ వార్షికోత్సవ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా అనుమాల లింగయ్య స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ భూమి,భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం 1946--51 మధ్య నైజాం నిరం కుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో మహత్తర పోరాటం సాగిందన్నా రు.ఈ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. అమరజీవి అనుమాల లింగ య్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం అమరవీరుల స్తూపాలు,పార్టీ దిమ్మెల వద్ద ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యల్లావుల రాములు,గుండు వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు,కడియాల అప్పయ్య,త్రిపురం సుధాకర్‌రెడ్డి, బిల్లా కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



# నిరాశ్రయ తల్లిబిడ్డకు సొంతింటి నీడ

**గరిడేపల్లి,సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**

మండలంలోని కల్మలచెరువు గ్రామంలో సత్రంలో జీవనం సాగిస్తున్న అనాథ తల్లిబిడ్డకు దాత ఏవీ రెడ్డి అండగా నిలిచా రు.తన సహకారంతో నూతన గృహాన్ని నిర్మించి శుక్రవారం తల్లిబిడ్డకు అందజేశారు. ఇన్నాళ్లు నిరాశ్రయులుగా జీవించిన వారికి సొంతింటి కలను సాకారం చేసి,ఆ కుటుంబానికి భరోసా కల్పించారు.పేదల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలుస్తున్న ఏవీ రెడ్డి సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి ఇంటిని నిర్మించి ఇవ్వడం ఎంతో గొప్ప మానవతా కార్యక్రమమని గ్రామ సర్పంచ్ బచ్చలకూరి శ్రీను పేర్కొన్నారు.సమాజంలో అవసరంలో ఉన్న వారిని గుర్తించి సహాయం చేయడం ఆదర్శనీయమని కొనియాడు తూ ఏవీ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి,మాజీ సర్పంచ్ కుక్కునూరు అంజయ్య మాజీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి,వార్డు సభ్యులు అమరవరపు నాగయ్య,కందుల త్రివేణి నవీన్,బొల్లగాని వెంకన్న, గ్రామ పెద్దలు సపిడి లచ్చిరెడ్డి, కమ్మలపల్లి వెంకటనారాయణ, నాయకులు సపిడి శంభిరెడ్డి, ధనమూర్తి లక్ష్మయ్య,షేక్ రఫీ, మీసాల సైదులు,అనంత కోటయ్య,అమరవరపు శ్రీను, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్

**తుంగతుర్తి, సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి):**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లోనే పేదలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని దేవుని గుట్ట తండా గ్రామ సర్పంచ్ గుగులోతు స్వాతి భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దేవుని గుట్ట తండా గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతగానో ఉపయోగ పడతాయని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వ సేవ పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది, రేషన్ డీలర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 17 ను తెలంగాణ విమోచన దినోత్సవం గా అధికారికంగా నిర్వహించాలి

### - ఆర్ డి ఓ కు బిజెపి నాయకుల వినతి

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 11,(ప్రజాజ్యోతి):**

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రభుత్వం అధికారిగాంగా నిర్వహించాలంటూ శుక్రవారం భారతీయ జనతా పార్టీ మిర్యాలగూడ వన్ టౌన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బంటుగిరి, కొంగరి వెంకటరమణ, మూల రాజిరెడ్డిల ఆధ్వర్యంలో ఆర్డీవో ఎస్ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం నియంత అరాచక పాలనను అంతమొందిస్తూ అప్పటి భారత ప్రభుత్వం, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో ఆపరేషన్ 'పోలో ' పేరిట సైనిక చర్య ద్వారా నిజాం మెడలు వంచి తెలంగాణ ప్రజలకు ఉపశమనం కల్పించారన్నారు. అప్పటివరకు నిజాం నిరంకుశ పాలనలో మగ్గిన తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ వాయువులు లభించాయని, తెలంగాణ భారత దేశంలో విలీనం జరిగిందని ఈ మహత్తర ఘట్టాన్ని గుర్తుచేస్తూ ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవం గా ప్రకటించాలని, వేడుకలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రేపాల పురుషోత్తం రెడ్డి, అల్లం అశోక్,బిజెపి జిల్లా కార్యదర్శి చిల్లం చర్ల అభి,ఓ బి సి జిల్లా ఉపాధ్యక్షులు బంటు యాదగిరి, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు మండల సోములు,మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు గోనె కవితా రెడ్డి,మునగాల శివ,చిలుకూరి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ చిలుకూరి శ్యాము, కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు, కంచుకొమ్ముల వేణు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ స్థాయి 'ప్రేరణ'కు శ్రీరామ్ ఎంపిక





**గరిడేపల్లి,సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లా విద్యారంగం లో కల్మల్ చెరువు విద్యార్థి అరు దైన ఘనత సాధించాడు.గరిడే పల్లి మండలం కల్మల్ చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన 10వ తరగతి విద్యా ర్థి గుండెబోయిన శ్రీరామ్ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహి స్తున్న ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి 'ప్రేరణ' అనుభవాత్మక విద్యా కార్యక్రమానికి ఎంపిక య్యాడు.2025 నవంబర్ లో జవహర్ నవోదయ విద్యాలయం లో నిర్వహించిన జిల్లా స్థాయి 'ప్రేరణ ఉత్సవ్'లో శ్రీరామ్ తన సృజనాత్మకత,నాయకత్వ లక్షణాలు,ప్రతిభతో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి కార్యక్రమానికి అర్హత సాధించినట్లు జిల్లా నో డల్ నవోదయ ప్రిన్సిపల్ ఆదినారా యణ ప్రకటించారు.జాతీయ స్థాయిలో గుజరాత్ లోని వాద్ నగర్ లోని (మోడీ చదివిన పాఠశాల) ది వెర్నాక్యులర్ స్కూల్ 2026 నవంబర్ 15 నుండి నవంబర్ 21వరకు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం లో పాల్గొననున్నాడు.కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత వసతి,ప్రయాణ సౌకర్యాలతో జరిగే ఈ కార్యక్రమంలో విలువ దారిత కరికులం,రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, భారతీయ సంస్కృతి,యోగా, నాయకత్వ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ పొందనున్నాడు.గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపి క కావడం పట్ల పాఠశాల ప్రధానో పాధ్యాయులు పిడమర్తి వీరబా బు,ఉపాధ్యాయులు,గ్రామ సర్పంచ్ బచ్చలకూరి శ్రీను,గ్రామ స్తులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీరామ్ విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని,భవిష్యత్తులో దేశానికి గర్వకారణంగా ఎదగాలని ఎంఈఓ ఛత్రు నాయక్ ఆకాంక్షించారు.

# పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి...

### - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి):**





జిల్లాలో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పోలీసు అధికారులను ఆదేశించారు. నేర సమీక్షా సమావేశంలో పెండింగ్ కేసులు, ఎన్‌బీడబ్ల్యూ కేసులు, సైబర్ నేరాలు, ఆస్తి నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై కేసుల వారీగా సమీక్ష నిర్వహించారు.సైబర్ మోసాలపై తక్షణమే స్పందించి బాధితుల నగదును ఫ్రీజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పరారీలో ఉన్న నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, వాహనాల తనిఖీలను పటిష్టం చేయాలని ఆదేశించారు. ప్రజల భద్రత, నాణ్యమైన దర్యాప్తు, బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు. సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసమే లక్ష్యం

### - మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా, జె.ప్రసన్న కుమారి




**గరిడేపల్లి,సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**

తెలంగాణ మోడల్ కళాశాల గడ్డిపల్లిలో నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకు తూ శుక్రవారం ఫ్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు. విద్యా ర్థులు ఉత్సాహంగా పాల్గొని సాంస్కృతిక,వినోద కార్యక్రమాల తో అలరించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా,జె. ప్రసన్న కుమారి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల వాతావర ణానికి త్వరగా అలవాటు పడుతూ,చదువుతో పాటు సాంస్కృతిక,సృజనాత్మక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, స్నేహభావం,నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడ తాయని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమం లో అధ్యా పకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేసుల పరిష్కారానికి.. రాజీ మార్గమే రాజమార్గం!

## - జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: ఎస్ఐ తేజస్విని



**నడిగూడెం, సెప్టెంబర్ 11, ప్రజా జ్యోతి:**

రాజీ మార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని నడిగూడెం ఎస్ఐ తేజస్విని తెలిపారు. శుక్రవారం నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.చిన్నపాటి వివాదాలు, క్షణికావేశంలో జరిగిన ఘటనలకు సంబంధించి నమోదైన కేసుల్లో చట్టపరంగా రాజీకి అవకాశం ఉన్న కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. శనివారం కోదాడ కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను నడిగూడెం మండల పరిధిలోని సంబంధిత కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవచ్చని, తద్వారా న్యాయస్థానాల్లో కేసుల పరిష్కారానికి పట్టే సమయం, వ్యయాన్ని తగ్గించుకోవచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో సంబంధిత కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# కూడలి నుంచి.. 'డాక్టర్' దాకా.!

- నీట్--2026లో ప్రతిభ.. ఖమ్మం మమత మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించిన ఇసరం వర్షిత
- నిరుపేద ఎస్సీ కుటుంబం నుంచి వైద్య విద్యలోకి అడుగులు
- మారుమూల గ్రామం విద్యార్థిని ఘనతపై గ్రామస్తుల హర్షం
- చదువు కొనసాగించేందుకు దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు

**మోతె సెప్టెంబర్11(ప్రజాజ్యోతి )**

మారుమూల గ్రామం నుంచి వచ్చిన ఓ నిరుపేద విద్యార్థిని పట్టుదలతో చదివి వైద్య విద్యలో సీటు సాధించి తన ప్రతిభను చాటుకుంది. సూర్యాపేట జిల్లా మోతె మండలం కూడలి గ్రామానికి చెందిన ఇసరం వర్షిత నీట్--2026లో ప్రతిభ కనబరిచి, ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. గ్రామానికి చెందిన విద్యార్థిని వైద్య విద్యలో అడుగుపెట్టడం తమకు ఎంతో గర్వకారణమని సర్పంచ్ బర్మావత్ మల్సూర్, ఉపసర్పంచ్ భూక్య సంధ్య, పంచాయతీ కార్యదర్శి కొండ్ర మల్లయ్య తెలిపారు.

**గురుకులంలో చదివి.. గమ్యం చేరి**

వర్షిత 1 నుంచి 4వ తరగతి వరకు, 5 నుంచి 10వ తరగతి వరకు సూర్యాపేట సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యనభ్యసించింది. అనంతరం వలిగొండ సాంఘిక సంక్షేమ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. కష్టపడి చదివి నీట్ లో మంచి ప్రతిభ కనబరిచి మెడికల్ సీటు సాధించిన వర్షితను గ్రామస్తుల సమక్షంలో శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు.

**మా కూతురిని డాక్టర్‌గా చూడాలి**



వర్షిత తల్లిదండ్రులు ఉపేందర్, మంజుల సామాజిక కార్యకర్తలుగా ఐటీసీ గ్రీన్ క్రాస్, ఎంవీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తున్నారు. మెడికల్ విద్యకు ఫీజులు, ఇతర ఖర్చులు అధికంగా ఉండటంతో ఆర్థిక భారం మోయడం తమకు కష్టంగా ఉందని వారు తెలిపారు. దాతలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి తమ కుమార్తె చదువు కొనసాగించేందుకు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సహాయం చేయదలచిన వారు ఫోన్‌పే: 9989941670కు పంపవచ్చని కోరారు.

# దోమల నివారణకు బ్లీచింగ్ చల్లింపు...

**అనంతగిరి (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 11**

అనంతగిరి మండలంలోని పాలవరం గ్రామంలో దోమల నివారణ, పారిశుధ్య పరిరక్షణలో భాగంగా బ్లీచింగ్ చల్లింపు కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, మురుగు కాలువలు, నీరు నిలిచే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ మట్టపల్లి నరేష్‌గౌడ్ మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ బెల్లంకొండ రవి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.





# పట్టా పాస్ బుక్ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి: ఏఈవో దుర్గా భవాని

**నిడమనూరు, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి):**

పట్టాదారులందరు తప్పకుండా రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి దుర్గా భవాని అన్నారు.శుక్రవారం రేగులగడ్డ క్లస్టర్ లో పట్టా పాస్ బుక్ ఉన్న ప్రతి రైతు తప్పకుండా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి చేయకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిచిపోతాయన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు ,పట్టా పాస్ బుక్ ,ఆధార్ లింక్ తో ఉన్న మొబైల్ నెంబర్ వివరాలతో వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ) వద్ద లేదా మీ సేవ కేంద్రంలో చేసుకోవాలని రైతులను సూచించారు. రేగులగడ్డ క్లస్టర్ లో ఇప్పటివరకు 70% శాతం మంది రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారు . మిగతా రైతులు రిజిస్ట్రేషన్ చేయకపోతే రబీఢ ఖరీఫ్ సీజన్ లో యూరియా బుకింగ్ కూడా నిలిపివేసే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి రైతు వెంటనే సంప్రదించి రైతు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోగలరని కోరారు.

# రహస్య స్థావరాల్లో 'నకిలీ' సిమెంట్ దందా!

## - ట్యాంకర్లలో నాసిరకం సరుకు.. పాత సంచుల్లో కేజీల లెక్కన రీ-ప్యాకింగ్

## - ఇటుకల తయారీతో పాటు ప్రభుత్వ పనులకే వాడేస్తున్న అక్రమార్కులు

## - కమీషన్ల కక్కుర్తితో ప్రజాధనం లూటీ.. చోద్యం చూస్తున్న యంత్రాంగం

**చౌటుప్పల్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి సరిహద్దుల్లోని శివారు గ్రామాలు అక్రమ వ్యాపారాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట్ రెవెన్యూ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా భారీ ఎత్తున 'నకిలీ సిమెంట్ రీ-ప్యాకింగ్' మాఫియా కార్యకలాపాలు సాగిస్తోంది. వివిధ కర్మాగారాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పి తిరస్కరణకు గురైన వ్యర్థాన్ని, నాసిరకం బల్క్ సిమెంట్‌ను ట్యాంకర్ల ద్వారా ఈ అడ్డాలకు చేరవేసి, పాత బస్తాల్లో నింపి బహిరంగ మార్కెట్లోకి వదులుతున్న ఘరానా దందా తాజాగా వెలుగుచూసింది.

**- తూప్రాన్‌పేట్ అడ్డాగా అర్ధరాత్రి రీ-ప్యాకింగ్**

తూప్రాన్‌పేట్ శివారులోని నిర్మానుష్య ప్రాంతాలు, రహస్య షెడ్లలో ఈ చీకటి నెట్‌వర్క్ కార్యకలాపాలు నిరాటంకంగా సాగుతున్నాయి. రాత్రి వేళల్లో ట్యాంకర్ల నుంచి నాసిరకం బల్క్ సిమెంట్‌ను నేలపై అన్‌లోడ్ చేస్తున్నారు. మార్కెట్లో సేకరించిన ప్రముఖ బ్రాండ్ల పాత ఖాళీ సంచుల్లోకి ఈ సరుకును కార్మికులతో మాన్యువల్‌గా నింపుతున్నారు. ఎటువంటి తూనికలు, కొలతల చట్టాలను పాటించకుండా చేతుల మీదుగానే కేజీల లెక్కన తూకం వేసి ప్యాక్ చేస్తున్నారు. పరిశ్రమల శాఖ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ ప్రక్రియలో, గాల్లోని తేమ సోకడం వల్ల సిమెంట్‌కు ఉండే బైండింగ్ బలం పూర్తిగా నశిస్తోంది.


**- ఇటుకల తయారీతో పాటు సర్కారు పనులకే వాడకం!**

ఈ నాసిరకం సిమెంట్‌ను తూప్రాన్‌పేట్, చౌటుప్పల్ పరిసరాల్లోని సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రాలు, ఫ్లోరింగ్ యూనిట్లకు తక్కువ ధరకు గుట్టుగా విక్రయిస్తున్నారు. బలహీనమైన ఈ సరుకుతో తయారయ్యే ఇటుకలు స్వల్ప ఒత్తిడికే పొడిపొడిగా రాలిపోయే ప్రమాదం ఉంది. దీనికితోడు స్థానికంగా ప్రభుత్వ భవనాలు, మురుగు కాలువలు, అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపట్టే కొందరు కాంట్రాక్టర్లు కమీషన్ల కక్కుర్తితో ఈ పాత సంచుల నకిలీ సిమెంట్‌నే వినియోగిస్తున్నారు. రికార్డుల్లో మాత్రం నాణ్యమైన బ్రాండెడ్ సరుకు వాడినట్లు తప్పుడు లెక్కలు చూపిస్తూ నిధులను దర్జాగా డ్రా చేసుకుంటున్నారు.

**- చోద్యం చూస్తున్న యంత్రాంగం!**

తూప్రాన్‌పేట్ పరిధిలో ఇంత బహిరంగంగా ట్యాంకర్ల ద్వారా రీ-ప్యాకింగ్ దందా సాగుతూ, నిర్మాణ రంగంలోకి నాసిరకం సరుకు చేరుతున్నా స్థానిక రెవెన్యూ, పంచాయతీ, ఇంజనీరింగ్, విజిలెన్స్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారుల అండదండలతోనే ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తూప్రాన్‌పేట్‌లోని అక్రమ గోదాములపై ఆకస్మిక దాడులు నిర్వహించి, నాసిరకం సరుకు వాడుతున్న కాంట్రాక్టర్లపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**సిమెంట్ ట్యాంకర్ల నుండి పాత బ్యాగుల్లోకి... అక్రమ దండ జోరు!**







# బీఎల్ఓలకు గౌరవ వేతనం ఇవ్వాలి

## - తహసీల్దార్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి

**గరిడేపల్లి,సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**



ఎన్నికల ప్రక్రియలో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్ఓ)కు గౌరవ వేతనం చెల్లించి,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం బీఎల్ఓలు సీఐటీయూ ఆధ్వర్యంలో గరిడేపల్లి తహసీల్దార్ స్రవంతి కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయ కులు ఎస్.కె.యాకూబ్ మాట్లా డుతూ ఏళ్లుగా ఎన్నికల విధులతో పాటు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో సేవలందిస్తున్న బీఎల్ఓలకు నామమాత్రపు పారితోషికం కూడా సక్రమంగా అందడం లేదన్నారు.రాజకీయ ఒత్తిళ్ల మధ్య రోజుకు 12 గంటల వరకు విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలను ప్రభుత్వం గుర్తించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు కల్పించాలని కోరారు.బీఎల్ఓ లకు నెలకు రూ.20 వేల గౌరవ వేతనం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రావుల వెంకన్న, ఎం.ఉమా,సైదమ్మ,ఎస్. నర్సిరెడ్డి,జయమ్మ,పద్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# జీఓ నం.97నువెంటనే రద్దు చేయాల్సిందే.. ఉద్యోగుల డిమాండ్:

## -ప్రభుత్వ పాలిటెక్నిక్ ఉద్యోగుల వంటావార్పు...

**నిడమనూరు,సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):**



నాగార్జునసాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఉద్యోగుల శుక్రవారం ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా జీఓ నం.97 వల్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, విద్యార్థులు, ఉద్యోగుల ప్రయోజనాలకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.జీఓ నం.97ను వెంటనే ఉపసంహరించు కోవాలని ఉద్యోగుల డిమాండ్ చేశారు.ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేసిన ఉద్యోగులు, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు దశలవారీగా నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు బాగ చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి కౌన్సిలర్ సుమయ్య తబస్సుం

**భువనగిరి,సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)**

స్థానిక ఎలిమినేటి లక్ష్మమ్మ నర్సారెడ్డి,మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్య తబస్సుం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ,నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహు తులనుఅలరించారు.కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సురేష్ రెడ్డి మాట్లాడుతూ,విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి మార్కులు సాధించి తమ భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని సూచించారు. అనంతరం వివిధ క్రీడా పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.అదే విధంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి,మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి కళాశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు,ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల,ప్రిన్సిపాల్ ఆనందిని కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రతి ఇల్లు పక్కాగా... ప్రతి కుటుంబం ధీమాగా..!

## - హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

**హాలియా,సెప్టెంబర్11(ప్రజా జ్యోతి)**

మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఇల్లు పక్కాగా.. ప్రతి కుటుంబం ధీమాగా జీవించే విధంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం హాలియా మున్సిపాలిటీలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ఆదేశాల మేరకు హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు.అవగాహన సమీక్షా సమావేశం నిర్వహించారు.హాలియా మున్సిపల్ కమిషనర్ కె.రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రరెడ్డి మాట్లాడుతూ, హాలియాను గుడిసెలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు 232 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. లబ్ధిదారులు ఈ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేస్తే, మున్సిపాలిటీ పరిధిలోని గుడిసెలలో నివసిస్తున్న పేదలకు మరో 60 ఇండ్లను కొత్తగా మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని,అనవసరంగా ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టి ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దని సూచించారు.మున్సిపల్ కమిషనర్



కె. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల చెల్లింపులు (పేమెంట్స్)ఆధార్ సీడింగ్‌కు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే హౌసింగ్ శాఖ ఏఈ,డీఈ అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.అలాగే ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని,భూగర్భ జలాల పెంపునకు ప్రతీ లబ్ధిదారుడు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని,ఇంటి పైకప్పు వర్షపు నీటిని భూమిలోకి మళ్లించాలని కోరారు.సమీక్షా సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, హౌసింగ్ శాఖ ఏఈ,మున్సిపల్ కౌన్సిలర్లు,కౌన్సిలర్ల సలహాదారులు,మున్సిపల్ వార్డు అధికారులు,ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పేదలకు కోమటిరెడ్డి బ్రదర్స్ కొండంత అండ

## - రూ.45 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేసిన జాజుల వీరయ్య

**నాగారం సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి.**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో పాటు పేద ప్రజలకు కోమటిరెడ్డి బ్రదర్స్ ఎల్లప్పుడూ అండగా ఉంటారని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జాజుల వీరయ్య అన్నారు.నాగారం గ్రామపంచాయతీ పరిధిలోని పిచ్చిరెడ్డి తండాకు చెందిన కునుసోత్ సోమ్లా కిడ్నీ ఆపరేషన్ చేయించుకుని ప్రస్తుతం ఇంటివద్ద చికిత్స పొందుతున్నారు.వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రూ.45 వేల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను సోమ్లా కుమారుడు కునుసోత్ యాకుబ్ నాయక్‌కు జాజుల వీరయ్య అందజేశారు.ఈ సందర్భంగా వీరయ్యమాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా అండగా నిలిచేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.పేదలకు



వైద్యపరమైన ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంగదుడ్ల దశరథ్, కాంగ్రెస్ నాయకుడు కడారు మధు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న దస్రు కి 70 వేల ఆర్థిక సాయం

## - కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి.....

**మోతె, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

మోతె మండలం రాయికుంట తండా (రాందాస్ తండా) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దస్రు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో విషయం తెలుసుకున్న మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి దస్రును పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారంతో రూ.70,000 ఆర్థిక సాయాన్ని దస్రుకు అందజేశారు. అనారోగ్య సమయంలో అండగా నిలిచి ఆర్థిక సాయం అందించడం పట్ల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య గౌడ్, గ్రామ సర్పంచ్ భూక్య ఉప్పయ్య, కాంగ్రెస్ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు గౌడ్, తుమ్మెటి అశోక్ రెడ్డి, భూక్య రవి, టీంకు, లచ్చు నాయక్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## - నాగారం బంగ్లాలో అర్హులకుడిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

**నాగారం సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి.**

ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నాగారం మండలం నాగారం బంగ్లా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బయ్యం సుజాత వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ చిరిక నరేందర్ రెడ్డి, గ్రామ రేషన్ డీలర్, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీ పై తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..

**నల్లగొండ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి ప్రతినిధి.)**

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ గత 54 సంవత్సరాలుగా గంగపుత్రులం ముదిరాజులం అన్నదమ్ములుగా కలిసిమెలిసి ఉంటున్న సంఘాన్ని బిజెపి కీ చెందిన మత్స్యశాఖ కో కన్వీనర్ ఎల్ రమణ తప్పుడు ప్రచారాన్ని చేస్తూ సంఘాన్ని చెడగొట్టే విధంగా ప్రయత్నిస్తున్నాడని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యదర్శి పడాల సైదులు,అధ్యక్షుడు వెంపటి యాదగిరి డిమాండ్ చేశారు. శాలిగౌరారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ పైన తప్పుడు ఆరోపణలు చేస్తున్న ఎల్ రమణ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ లోని మత్స్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గత మూడు నెలల క్రితం మత్స్య సహకార ఎన్నికలు జరిగాయని మాకు పోటీగా పోటీ చేసిన వారు ఓడిపోవడం జరిగిందని దీనిని జీర్ణించుకోలేక గెలిచిన మా సభ్యులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ మత్స్య కార్మికులను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఇట్టి విషయాన్ని 15 రోజుల క్రితం ఏర్పాటుచేసిన సంఘ సభ్యుల సమావేశంలో ఏడి, డీఎఫ్ సి చైర్మన్ జిల్లా కుల పెద్దలు హాజరై ఇరువర్గాల మత్స్య కార్మికులందరూ ఐక్యమత్తంగా ఉండి మత్స్య సంపదను మత్స్య కార్మికులకు చెందే విధంగా ఉండాలని వారు సూచించడం జరిగింది అని తెలిపారు.



ఇటీవల కాలంలో బిజెపి నాయకుడు ఎల్ రమణ మా సొసైటీ మత్స్య కార్మికులను పదిమందిని తీసుకొని జిల్లా మత్స్య శాఖ కార్యాలయానికి వెళ్లి మా పాలకమండలి పైన అసత్యపు ప్రకటన చేస్తూ ఐదు కోట్ల రూపాయలకు చెరువును అమ్మినట్లు తప్పుడు ప్రకటనలు చేసి సంఘాన్ని చెడగొడుతున్నాడని ఆరోపించారు. తప్పుడు ప్రచారం చేస్తున్న రమణను బీజేపీ నుండి సస్పెండ్ చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడిని కోరడం జరిగింది అని తెలిపారు. లేనియెడల రాష్ట్ర అధ్యక్షుడు వద్దకు వెళ్లి నిరసన తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా శాలిగౌరారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పైన తప్పుడు ప్రచారం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాలిగౌరారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు బొల్లేపల్లి నాగరాజు, డైరెక్టర్లు తెడ్ల బిక్షం, చింతకాయల అంజయ్య వెంపటి సైదులు, బాకీ దానయ్య, వెంపటి మైసయ్య, తదిరులున్నారు,

# క్రీడాకారులకు సర్పంచ్ చేయూత

## - క్రీడా దుస్తుల కోసం రూ.20 వేల విరాళం
## - విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం
## - సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి

**నాగారం సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి.**

నాగారం మండలంలోని ఫణిగిరి గ్రామంలో హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తుండగా ఈ కార్యక్రమానికి హాజరై , గ్రామ సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి క్రీడాకారులకు చేయూతనందించారు.క్రీడా దుస్తుల కోసం రూ. 20 వేల విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచించారు.క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు, ఉప సర్పంచ్ భాను ప్రకాష్, వివిధ గ్రామాల స్కూల్ పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే విబిజీ రాం జీ పథకం లక్ష్యం

## - మండల ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి
## - అన్ని గ్రామాల్లో ఉపాధి పనుల ప్రణాళికలపై అవగాహన సదస్సు






**మిర్యాలగూడ, సెప్టెంబర్ 11, (ప్రజాజ్యోతి):**

వికసిత్ గ్రామీణ్ ప్రిపరేషన్ ప్లాన్ మిర్యాలగూడ మండల గ్రామపంచాయతిల్లో సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి,పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జె.వెంకట్ రెడ్డి కోరారు. ఆయన అధ్యక్షతన మండల స్థాయి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికసిత భారత్ -2047 లక్ష్యానికి అనుగుణంగా గ్రామాలను అభివృద్ధి చేయడమే విబిజిరాంజీ చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ప్రతి కుటుంబానికి125 రోజుల ఉపాధి కల్పించాలన్నారు. గ్రామసభ నిర్వహించి అందులో సర్పంచ్ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, కూలీలు, మహిళలు, యువత ఇతర వర్గాల ప్రజల భాగస్వామ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఇప్పటివరకు గ్రామంలో అందుబాటులో ఉన్న వనరులను, ఆస్తులను వాస్తవ అవసరాలను మౌలిక వసతులను, అభివృద్ధి లోటుపాట్లను ప్రజల భాగస్వామ్యంతో గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను రూపొందించి సమగ్ర ప్రణాళిక తయారుచేయాలన్నారు. 22 శాఖలఅధికారులు వీజీపీపీ ప్రణాళిక తయారు చేయుటలో చురుకుగా పాల్గొనా లన్నారు.విబిజిరాంజీ పథకము ద్వారా తెలియజేసి 22 శాఖలకు సంబందించిన 318 పనులలో నీటి భద్రత, గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధి, విపత్తు నివారణ నాలుగు ప్రధాన కేటగిరి పనులకు ప్రాధాన్యతను ఇచ్చి ప్రణాళికలో చేర్చాలన్నారు. ప్రజలకు అవసర పనులు, ఎక్కువ లబ్ధిదారుల సంఖ్య, సాంకేతిక సాధ్యత ఆధారంగా ప్రాధాన్యతను కేటాయించాలన్నారు. వీజీపీపీలో భాగంగా మిర్యాలగూడమండలంలో యాద్గార్ పల్లి గ్రామ పంచాయతీ మోడల్ గ్రామపంచాయతీగా ఎంపిక చేశామన్నారు. ఈ నెల 15న మొదటిరోజు గ్రామసభ ప్రారంభం చేసి విబిజీ రాంజీ పైన గ్రామ ప్రజలకు సభకు హాజరైన వారికి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 16 నుండి 18 వరకు 3 రోజులు గ్రామంలోని అన్ని రోడ్లలో ట్రాన్సెక్ట్ వాక్ చేయాలన్నారు. గ్రామ పరిస్థితిని విశ్లేషించి అవసర పనులను గుర్తించాలన్నారు. ఈ నెల 19న, రెండవ గ్రామసభ నిర్వహించి ప్రాధాన్యత క్రమంలో గుర్తించిన పనులను గ్రామ వీజీపీపీ ఆమోదం పొందాలన్నారు. విజిపిపిలో తెలిపిన పనులను ప్రొఫార్మలో మండలకార్యాలయంలో ఈ నెల 20న సమర్పించాలని ఎంపిడిఓ శేషగిరిశర్మ కోరారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి మాతంగి రమేష్, వ్యవసాయ అధికారి ఎం.ఋష్యేంద్రమణి, మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మొయిద్, ఆర్డబ్ల్యూఎస్ సహాయ ఇంజనీర్ మణిదీప్, సహాయ ఇంజనీర్ ఇరిగేషన్ మానస, మండల విద్యాధికారి డి.ధర్మానాయక్, ఏపిఎం దిలీప్ కుమార్, టిఏలు ఫీల్డ్ అసిస్టెంట్లు సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కొండ్ర సైదమ్మకు ఘన సత్కారం

**నల్లగొండ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

కట్టంగూర్‌లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన కార్యకమంలో చందుపట్ల ఎంజేపీ బాలికల పాఠశాలలో టీజీటీగా ఫిజిక్స్, సైన్స్ బోధిస్తున్న కొండ్ర సైదమ్మను ఉత్తమ ఉపాధ్యాయు రాలిగా ఘనంగా సత్కరించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఫిజిక్స్, సైన్స్‌పై వారిలో ఆసక్తిని పెంపొందించేందుకు సైదమ్మ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. విద్యాబోధనతో పాటు డిప్యూటీ వార్డెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) అంబటి అంజయ్య, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్త మంజుల మాధవరెడ్డి చేతుల మీదుగా కొండ్ర సైదమ్మకు ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందజేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది సైదమ్మను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు లభించిన గౌరవం పట్ల కుటుంబ సభ్యులు కూడా హర్షం వ్యక్తం చేశారు.సైదమ్మ భర్త కిషోర్ ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యారంగంలో ఆమె అందిస్తున్న సేవలకు ఈ అవార్డు తగిన గుర్తింపు అని పేర్కొన్నారు.



# మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం

**నాగారం సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి.**

నాగారం మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖలో జరిగిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎంపీడీవో అంజిరెడ్డి మాట్లాడుతూ గ్రామల సమగ్ర అభివృద్ధి కి సర్పంచులు తోడ్పడాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించి ఆదర్శన గ్రామాలుగా తీర్చిదిద్దే బాధ్యత సర్పంచుల పై ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దేవేంద్ర ప్రసాద్ మండల వ్యవసాయ అధికారి కృష్ణ కాంత్ వివిధ శాఖ ల అధికారులు సర్పంచ్ లు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




# గుండాల మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడికి అంతర్జాతీయ గుర్తింపు

## - ఫిన్లాండ్ ఎక్స్ పోజర్ విజిట్ కు వరకాల మధుసూదన్ ఎంపిక

**గుండాల సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) :**



తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ టీచర్ ఎక్స్ పోజర్ విజిట్ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మోడల్ స్కూల్ కు చెందిన టీజీటీ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వరకాల మధుసూదన్ రావు ఎంపికయ్యారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా విధానాలకు ప్రసిద్ధి చెందిన ఫిన్లాండ్ దేశంలో అమలవుతున్న ఆధునిక బోధన పద్ధతులు విద్యార్థి కేంద్రీకృత ,విద్యా విధానం, వినూత్న అభ్యసన పద్ధతులు పాఠశాల నిర్వహణ విధానాలను అధ్యయనం చేసేందుకు ఎక్స్ పోజర్ విజిట్ నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంతర్జాతీయ స్థాయి ఉత్తమ విద్యా విధానాలను తెలుసుకొని ఆ పద్ధతులను ఇక్కడ అమలు చేయాలని లక్ష్యంతో ఈ పర్యటనకు పంపుతున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మన్నె అగ్గి రాములు, సర్పంచులు దేవన బోయిన ఐలయ్య, అలంశెట్టి మహేష్, హై స్కూల్ ప్రధానో పాధ్యాయురాలు గంధం చంద్రకళ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం ఆయనను శాలువాలతో సన్మానించి హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీ కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

**నల్లగొండ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి ప్రతినిధి )**

నకిరేకల్ పట్టణంలోని శ్రీ కనకదుర్గ దేవి ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ





సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కందాల సత్తిరెడ్డి, ధర్మకర్త గోలి పద్మతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# సందర్భం కాదు..సాయం చేసే మనసే ముఖ్యం నిరుపేదలకు 4వ సారి అన్నదానం

**నార్కట్ పల్లి , సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**


ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టేందుకు ప్రత్యేక సందర్భాలు అవసరం లేదుని, మంచి మనసు ఉంటే చాలు అని నాలుగోసారి నిరూపించారు. నార్కట్ పల్లి లో నిర్వహించే నిరుపేదలకు నిత్యం 637 రోజుల అన్నదానం చేయడం చాలా గొప్ప విషయం అని, వారికి మనమే సహాయ సహకారాలు అందించలని డా బయ్యా అనిల్ తెలిపారు. ఈ సంస్థ లో 4వ సారి అన్నదానం చేపియడం చాలా సంతోషం అని, ఇంకా మరిన్ని దానాలు ఆ భగవంతుడు నాతో చేపిస్తాడు అని తెలిపారు. భగవంతుడు సేవ కంటే నరుడు సేవ భగవంతుడు మెచ్చుతాడు, ఈ మధ్యకాలం లో అర్భటలకు అధికంగా ఖర్చు చేస్తున్నారు, అలా కాకుండా నిరుపేదలకు చేస్తే సమాజం మెరుగుపడుతుంది అని తెలిపారు, ఈ కార్యక్రమం లో డా,బయ్యా అనిల్, తన తల్లితండ్రులు బయ్యా వెంకటయ్య – అలివేలు మరియు వారి స్నేహితులు కలిసి అన్నదానం కార్యక్రమం నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు.



# జక్క రాంరెడ్డిపై జిల్లా కలెక్టర్ కి పిర్యాదు అనుమతి లేకుండా పౌల్ట్రీ ఫరామ్స్ నిర్వహణ?

**చింతపల్లి సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)**

చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామంలోని సర్వే నంబర్ 119,115లో నిర్మించిన కోళ్లఫామ్ (పౌల్ట్రీ)లకు ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారని నల్గొండ జిల్లా కలెక్టర్ కి పిర్యాదు చేసినట్లు పల్లపు గోవర్ధన్ చారవహిని ద్వారా తెలిపారు.అదేవిధంగా అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కోళ్లఫారాల మీద తెలంగాణ పోల్యూషన్ బోర్డులో పిర్యాదు చేసినట్లు సమాచారం.కచ్చితంగా గ్రామపంచాయతీ నుండి (బీఫా) నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ పొంది ఉండాలి.దీంతో పాటు కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం కోళ్ల సంఖ్యను బట్టి అనుమతి పొంది ఉండాలి.వ్యవసాయ భూమిని పౌల్ట్రీ అవసరాల కోసం మార్చేటప్పుడు రెవెన్యూ శాఖ నుండి నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసిస్టెంట్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది.కావున ఈ సర్వే నంబర్ లో నిర్వహించే కోళ్ల ఫరామ్స్ ఎలాంటి అనుమతులు లేవని ,అనుమతి లేకుండా నిర్వహించే వాటి యజమాని మీద చర్యలు తీసుకొని సంబంధించి శాఖలకు పిర్యాదు చేసినట్లు



To

The Member Secretary / Environmental Engineer,

Telangana Pollution Control Board (TSPCB),

Hyderabad, Telangana

10 SEP 2025

Subject:Complaint seeking immediate inspection and legal action against alleged establishment/operation of a poultry farm/commercial activity on agricultural land at Godkondla Village, Chinthapalle Mandal, Nalgonda District, without requisite pollution control consents, with potential pollution from poultry litter, manure, dead birds, wastewater, odour and other environmental impacts – request for action under the Water (Prevention and Control of Pollution) Act, 1974, Air (Prevention and Control of Pollution) Act, 1981, Environment (Protection) Act, 1986 and applicable CPCB/TSPCB guidelines

Respected Sir/Madam

I, the undersigned complainant, respectfully submit this complaint seeking immediate intervention by the Telangana Pollution Control Board in respect of an alleged poultry farm/commercial activity being established/operated on agricultural land situated at Godkondla Village, Chinthapalle Mandal, Nalgonda District, particularly in relation to the land identified in the accompanying records as Survey No: 115/e2/1, extent approximately 0.1000 Acres / 10 Guntas, and any connected/surrounding land being used for the said activityThe information available to me indicates that a poultry-related commercial activity/structure is being established or operated on land recorded as agricultural land. The original land records supplied with this complaint also contain substantial agricultural-land holdings in Godkondla and other villagesThe purpose of this complaint is not merely to raise a revenue or land-classification dispute, but to request the competent Pollution Control Board to independently examine whether the proposed/existing activity is causing or is likely to cause environmental pollution and whether all mandatory environmental consents and safeguards have been obtained and complied with

1. Applicability of pollution-control law

If the activity constitutes a poultry farm covered by the applicable CPCB/TSPCB requirements, the operator is required to comply with the applicable consent regime and environmental safeguards

The CPCB's Environmental Guidelines for Poultry Farms specifically provide that poultry farms handling more than 5,000 birds at a single location, with effect from 01.01.2025, are required to obtain Consent to Establish (CTE) and Consent to Operate (CTO) under the Water Act, 1974 and Air Act, 1981. (Central Pollution Control Board

# బ్యాంకు ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాటం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**








బ్యాంకు ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎన్ సి బి ఈ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు అయితగాని మహేష్ అన్నారు.శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా సూర్యాపేటలో బ్యాంకు ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నామని తెలిపారు. ప్రస్తుతం రెండు శనివారాలు సెలవులు ఉండగా, మిగిలిన రెండు శనివారాలను కూడా సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కస్టమర్లకు బ్యాంకు సేవలు సాయంత్రం నాలుగు గంటలకే ముగిసినా, ఉద్యోగులు మాత్రం రాత్రి తొమ్మిది, పది గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారని, తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు.ఐదు రోజుల పనిదినాలు అమలు చేసినా కస్టమర్లకు ఇబ్బంది కలగకుండా సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ అదనంగా 40 నిమిషాల పాటు సేవలు అందించేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దీనిపై భారతీయ బ్యాంకుల సంఘంతో ఒప్పందం జరిగినప్పటికీ రెండున్నరేళ్లు దాటినా అమలు చేయక పోవడం విచారకరమన్నారు.పనితీరు ఆధారిత ప్రోత్సాహకంలోనూ ఉద్యోగుల మధ్య వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. బ్యాంకుల లాభాల్లో ఉద్యోగుల శ్రమ కీలకమని, అందుకు అనుగుణంగా న్యాయమైన ప్రోత్సాహకం అందించాలని కోరారు. కింది స్థాయి ఉద్యోగులకు 15 రోజుల జీతం ప్రోత్సాహంగా , పైస్థాయి అధికారులకు 365 రోజుల జీతం ప్రోత్సాహంగా ఇవ్వడం సరికాదన్నారు.కేంద్ర ప్రభుత్వం బ్యాంకులను బలహీనపరిచి భవిష్యత్తులో ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగులను విభజించి పాలించే విధానాన్ని సహించబోమని స్పష్టం చేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల సమ్మె నిర్వహిస్తామని తెలి పారు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భాస్కర్, ఫణి, వంశీ, నీల శ్రీనివాస్, ఎస్ రామకృష్ణ, అలీం, శ్రీధర్, నరేష్, వెంకటేశ్వర్లు, వికాస్, సురేష్,నవీన్, కిషోర్, కృష్ణ హేమలత, ప్రియాంక, సౌజన్య, నాగిరెడ్డి, నందన్, ఉమ మహేష్, చిట్టిబాబు, పవన్ శర్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ సర్పంచ్ లకు ,చేయూత పెన్షన్ డిజిగ్నేటెడ్ ఆఫీసర్స్అవగాహనః నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం

**నిడమనూరు, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి):**



పంచాయతీ సర్పంచ్ లకు ,చేయూత పెన్షన్ డిజిగ్నేటెడ్ ఆఫీసర్స్ నిడమనూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ పై ఓరియంటేషన్ ఎంపీడీవో ఇమామ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో వి బి.జీ.రాంజీ పనులు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా చేయూత పెన్షన్ డిజిగ్నేటెడ్ ఆఫీసర్స్ ఈనెల 25 తేదీ వరకు వెరిఫికేషన్ చేసి వారి మొబైల్ ద్వారా అర్హత గల పెన్షన్ దారుల వివరాలను పరిశీలించి అర్హులైన వారి వివరాలు డి ఆర్ డి ఓ కి పంపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు ,మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, చేయూత పెన్షన్ డిజిగ్నేటెడ్ ఆఫీసర్స్, సిబ్బంది , తదితరులు ,పాల్గొన్నారు.



# మిడిదోడ్డి గురవయ్య మృతి బాధాకరం

## మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**నడిగూడెం, సెప్టెంబర్ 11, ప్రజా జ్యోతి:**



కరివిరాల గ్రామానికి చెందిన మిడిదోడ్డి గురవయ్య అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. గురవయ్య మృతి విషయం తెలుసుకున్న ఆయన కరివిరాల గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గురవయ్య మృతి కుటుంబ సభ్యులు, బంధువులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఉపేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొని గురవయ్యకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

## విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):**







పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని, పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.సూర్యాపేట పట్టణంలోని సరస్వతీ విద్యాలయంలో శుక్రవారం నల్లగొండ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో, మాధవస్మారక సమితి సహకారంతో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఫీల్డ్ అసిస్టెంట్ అనంతుల వీరాస్వామిగౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రానున్న వినాయక చవితి రోజున ప్రతి కుటుంబం మట్టి గణపతిని పూజించాలని, పర్యావరణహితంగా పండుగను నిర్వహించాలని విద్యార్థులకు సూచించారు. మట్టి విగ్రహాల వినియోగంతో నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం

## - దళితులు ఉన్నత స్థానాల్లో ఎదిగితే బీఆర్ఎస్ ఓర్వలేకపోతోంది

## - శాసనసభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది

## - స్పీకర్,కుటుంబంపై కించపరిచే వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. దళితులు ఉన్నత పదవుల్లోకి ఎదగడాన్ని బీఆర్ఎస్ నాయకత్వం ఓర్వలేక అహంకారపూరిత వ్యాఖ్యలకు పాల్పడుతోందని తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్, పీసీసీ అధికార ప్రతినిధి దూడెం వెంకట రమణ, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ విమర్శించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రెడ్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం, సామాజిక వర్గాలను కించపరిచే వ్యాఖ్యలకు రాజకీయాల్లో తావు ఉండకూడదని స్పష్టం చేశారు.





### దళితులపై కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదు

దూడెం వెంకట రమణ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దళితులపై ఏనాడూ నిజమైన ప్రేమ లేదని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా అమలవుతున్న రిజర్వేషన్లను అమలు చేయడం మినహా దళితుల సంక్షేమం, సాధికారత కోసం ఆయన మనస్ఫూర్తిగా చేసిందేమీ లేదని విమర్శించారు. గతంలో దళిత నాయకుడు మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఆయనకు తగిన హోదా, గౌరవం కల్పించలేదని ఆరోపించారు. ప్రస్తుతం దళితుడైన గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభ స్పీకర్‌గా కొనసాగుతున్నారని, ఆయనను గౌరవిస్తూ సభలో "అధ్యక్షా" అని సంబోధించాల్సి వస్తుందనే అహంకారంతోనే కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా అన్ని సదుపాయాలు, హోదా అనుభవిస్తూ శాసనసభ సమావేశాలకు హాజరుకాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం బీఆర్ఎస్‌కు శాసనసభ పట్ల ఉన్న గౌరవాన్ని తెలియజేస్తోందన్నారు.

### ప్రజా సమస్యలపై చర్చించకుండా గందరగోళమెందుకు?

శాసనసభలో ప్రజా సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఉన్నప్పటికీ దాన్ని వినియోగించుకోకుండా బీఆర్ఎస్ నాయకులు సభ వెలుపల గందరగోళం సృష్టిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే అది శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా ఉండాలని పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్లచొక్కాలు ధరించి నినాదాలు, రాతలు ప్రదర్శిస్తూ అసెంబ్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడం సభ నియమ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. పోలీసుల పట్ల అనుచితంగా వ్యవహరించడం, పోలీసు వ్యవస్థను కించపరిచేలా ప్రవర్తించడం ప్రజాప్రతినిధులకు తగదన్నారు. శాసనసభ స్పీకర్ పదవికి భంగం కలిగించేలా, స్పీకర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగం, శాసనసభ, స్పీకర్ పదవి, పోలీసు వ్యవస్థ వంటి ప్రజాస్వామ్య సంస్థలను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు.

### చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఆయన కుటుంబ సభ్యులపై కించపరిచే వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఇకపై సహించేది లేదని, బీఆర్ఎస్ అహంకారానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని వారు హెచ్చరించారు.

# వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ మాసం వేడుకలు

**హాలియా,సెప్టెంబర్11(ప్రజా జ్యోతి)**

శ్రావణ మాస చివరి వారం పురస్కరించుకుని పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిపార వశ్యం విల్లివిరిసేలా సామూహిక సహస్రనామ కుంకుమార్చన, శ్రీమహాలక్ష్మీ మూలమంత్ర హోమ క్రతువులు నయనానందకరంగా సాగాయి. వేదమం త్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్థానాచార్యుల గోవర్ధన రాఘవాచార్యుల ఆధ్వర్యంలో, ఋత్విక్కులు శ్రీరామచార్యులు, శ్రీనాథచార్యులు ఈ విశేష పూజలను శాస్త్రోక్తంగా పూర్తిచేశారు. శ్రావణ లక్ష్మిని ఆరాధిస్తూ మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనల్లో ఆసీనులయ్యారు. హోమ గుండంలో ఆహుతులు సమర్పించి లోకకళ్యాణాన్ని, పాడిపంటలను కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు. ధార్మిక కార్యకలాపాలు ముగిసిన అనంతరం భక్తులకు స్వయంగా మహా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు పితా వెంకటేశ్వరరాజు,శ్రీనివాసరావు, వరలక్ష్మి,అరుణ,లావణ్య,జయ, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.



# సమగ్ర వ్యవసాయంతో మహిళా రైతులకు నిరంతర ఆదాయం!





**నడిగూడెం, సెప్టెంబర్ 11, ప్రజా జ్యోతి:**

మహిళా రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలను అవలంబిస్తూ నిరంతర ఆదాయం పొందడంతో పాటు కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పలువురు సూచించారు. శుక్రవారం సిరిపురం గ్రామంలోని శేషుబాబు సమగ్ర వ్యవసాయ క్షేత్రంలో ఆత్మ పథకం ఆధ్వర్యంలో సిరిపురం, నారాయణపురం గ్రామాల మహిళా రైతులకు సమగ్ర వ్యవసాయ విధానం, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయంలో మహిళల పాత్ర, మహిళల ఆరోగ్యంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరి ఫౌండేషన్ సామాజిక కార్యకర్త గోపి ప్రకృతి వ్యవసాయం, కిచెన్ గార్డెన్ ప్రాధాన్యతను మహిళా రైతులకు వివరించారు. శేషుబాబు సమగ్ర వ్యవసాయ విధానం ద్వారా పంటలతో పాటు అనుబంధ వ్యవసాయ కార్యకలాపాల ద్వారా ఏడాది పొడవునా ఆదాయం పొందవచ్చని తెలిపారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. ప్రతి మహిళా రైతు సమగ్ర వ్యవసాయ విధానాన్ని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ నివేదిత, సహాయ వ్యవసాయ సంచాలకులు కోదాడ స్రవంతి, నడిగూడెం వ్యవసాయ అధికారి జి. మల్సూర్, వ్యవసాయ విస్తరణ అధికారులు రేణుక, ఉమేష్, వెంకట్‌రెడ్డి, ఉపేందర్‌తో పాటు మహిళా రైతులు లక్ష్మీప్రియ, మంజుల, పద్మావతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో గురుకుల బాలికల హవా!

## కబడ్డీ.. కోకో.. వాలీబాల్‌లో విజయకేతనం



**నడిగూడెం, సెప్టెంబర్ 11, ప్రజా జ్యోతి:**

క్రీడల్లో రాణిస్తేనే విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి అన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో గురుకుల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపిక కావడం పట్ల శు క్రవారం ఆమె విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మెడల్స్ అందజేసి అభినందనలు తెలిపారు. అండర్-14 విభాగంలో కబడ్డీ, కోకో పోటీల్లో ప్రథమ బహుమతులు సాధించి



జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అలాగే అండర్-17 విభాగంలో కోకో, వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతులు, కబడ్డీలో ద్వితీయ బహుమతి సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత పొందారు. వరుస విజయాలతో గురుకుల పాఠశాల విద్యార్థినులు తమ క్రీడా ప్రతిభను చాటుకోవడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వాణి మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి నిరంతరం సాధన చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. జిల్లా స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు క్రీడల్లో విశేష ప్రతిభ కనబరచడంలో కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ సుశీలను కూడా ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ విజయశ్రీ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులను వేగవంతం చేయాలి

- ఇచ్చిన గడువులో నాణ్యతతో పనులు పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లాలో నిర్మాణంలో ఉన్న మూడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులను వేగవంతం చేసి,నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో పాఠశాలల నిర్మాణ పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని గడ్డిపల్లి, కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు, తుంగతుర్తి నియోజకవర్గంలోని తొండ గ్రామాల్లో రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.600 కోట్ల వ్యయంతో మూడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పనులను ఆర్కిటెక్చర్ డిజైన్ ప్రకారం,ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్ పనులను కూడా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ భానుప్రసాద్, డీఈవో అశోక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్‌కుమార్, ఏఈ ఓబులేష్, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలి

- అడిషనల్ కలెక్టర్ జె. శ్రీనివాస్

**హాలియా,సెప్టెంబర్11(ప్రజా జ్యోతి)**

అనుముల మండలం ముక్కామల గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సర్వే విచారణ ప్రక్రియను నల్గొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)జె. శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న విచారణ తీరును,నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నబిఎల్వో లు, సూపర్‌వైజర్లకు పలు కీలక సూచనలు చేశారు. సర్వే నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా,పారదర్శకంగా విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అనుముల మండలంలో ప్రస్తుతం జరుగుతున్న సర్ పురోగతి, నమోదైన గణాంకాల వివరాలను స్థానిక తహసీల్దార్‌ను బి.చందర్ రావును అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా మండలంలో సర్వే ప్రక్రియ అంతా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని,ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్‌ను సూచించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చేపట్టిన ఈ విచారణలో అధికారులు,సిబ్బంది అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో



## ఒక్క సీసీ కెమెరా 100 మందికి సమానం

**ఆలేరు సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి)**

ప్రతి ఒక్క షాపు వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఒక్క సీసీ కెమెరా 100మందికి సమానం అని ఎస్సై కుమారస్వామి అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కేంద్రంలో వ్యాపారస్తులకు షాపు నిర్వాహకులకు సీసీ కెమెరాలు ఏర్పాటు పై సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క షాపు వారు సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాలలో కొత్తవారు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వస్తే వెంటనే పోలీస్ లకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది షాపు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.





# చెస్‌లో మెరిసిన చింతారెడ్డి త్రివేణి

## - సౌత్‌జోన్‌కు పోటీలకు ఎంపిక

**చింతలపాలెం, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):**

నల్లగొండలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్--మహాత్మా గాంధీ యూనివర్సిటీ స్థాయి క్రీడా పోటీల్లో చెస్ విభాగంలో చింతలపాలెం మండలం నెమలిపురి గ్రామానికి చెందిన విద్యార్థిని చింతారెడ్డి త్రివేణి ప్రతిభ చాటారు. ఆమె ప్రాతినిధ్యం వహించిన జట్టు ప్రథమ బహుమతి సాధించింది. నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న త్రివేణి, కళాశాల తరఫున చెస్ పోటీల్లో పాల్గొన్నారు. తన ప్రతిభతో ఆకట్టుకున్న ఆమె జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఇద్దరు క్రీడాకారులను సౌత్‌జోన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నవంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న సౌత్‌జోన్ పోటీల్లో వారు పాల్గొననున్నారు. నెమలిపురి గ్రామానికి చెందిన విద్యార్థిని యూనివర్సిటీ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ప్రథమ బహుమతి సాధించడం పట్ల గ్రామస్థులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సౌత్‌జోన్ పోటీల్లోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.



# బాలల హక్కులపై అవగాహన

**గరిడేపల్లి,సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

గరిడేపల్లి కస్తూర్బా గాంధీ బాలిక ల విద్యాలయంలో బాల రక్ష భవ న్--జిల్లా బాలల పరిరక్షణ విభా గం ఆధ్వర్యంలో బాలల హక్కు లు చట్టాలు,సమస్యలపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఆఫీస ర్ ఎస్‌కే నాగుల మీరా మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యంతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.వి.వి. శ్రీలక్ష్మి,సాయి త్రిలోక్ లు బాలల హక్కు లు బాధ్యతలు,ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలపై అవగా హన కల్పించారు.చైల్డ్‌లైన్ సభ్యుడు వంశీ 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వివరించా రు.పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు వై.శైలజ మంచి స్నేహాలను ఎంచుకుని,చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు జ్యోతి,సుహాసిని,అనూష,ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



# పెన్‌పహాడ్‌లో ముగిసిన మండల ఎస్‌జీఎఫ్ క్రీడలు

**పెన్‌పహాడ్, సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**



మండలంలోని పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్ అనంతారం పాఠశాల వేదికగా రెండు రోజుల పాటు సాగిన పెన్‌పహాడ్ మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల అభివృద్ధి అధికారి ఏ. జానయ్య గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో రాణించి డివిజన్, జిల్లా స్థాయిలో మండలానికి మంచి పేరు తేవాలన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన ఎంఈఓ ఎన్. రవి, ఆతిథ్యమిచ్చిన హెచ్‌ఎం ఎర్రంశెట్టి రవీంద్రబాబు, వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అనంతరం ప్రతిభావంతులైన క్రీడాకారులను ఉన్నత స్థాయి జట్లకు ఎంపిక చేశారు.రెండు రోజుల పాటు హోరాహోరీగా సాగిన పోటీల ఫలితాలు ఇలా ఉన్నాయి. అండర్-14 బాలికల కబడ్డీలో అనాజిపురం జెడ్పీహెచ్‌ఎస్ మొదటి బహుమతి సాధించగా, దోసపహాడ్ గురుకులం రెండవ బహుమతి గెలుచుకుంది. ఖో-ఖోలో అనాజిపురం జెడ్పీహెచ్‌ఎస్ మొదటి బహుమతి, దోసపహాడ్ గురుకులం రెండవ బహుమతి సాధించాయి. వాలీబాల్‌లో జీ.మల్కాపురం జెడ్పీహెచ్‌ఎస్ మొదటి బహుమతి, పెన్‌పహాడ్ కేజీబీవీ రెండవ బహుమతి కైవసం చేసుకున్నాయి. అండర్-17 బాలికల కబడ్డీలో దోసపహాడ్ గురుకులం మొదటి బహుమతి, పెన్‌పహాడ్ కేజీబీవీ రెండవ బహుమతి సాధించాయి. ఖో-ఖోలో దోసపహాడ్ గురుకులం మొదటి బహుమతి, అనాజిపురం జెడ్పీహెచ్‌ఎస్ రెండవ బహుమతి పొందాయి. వాలీబాల్‌లో గాజుల మల్కాపురం జెడ్పీహెచ్‌ఎస్ మొదటి బహుమతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ రెండవ బహుమతి సాధించాయి.అండర్-14 బాలుర కబడ్డీలో అనాజిపురం జెడ్పీహెచ్‌ఎస్ మొదటి బహుమతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ రెండవ బహుమతి గెలిచాయి. ఖో-ఖోలో అనంతారం జెడ్పీహెచ్‌ఎస్ మొదటి బహుమతి, అనాజిపురం జెడ్పీహెచ్‌ఎస్ రెండవ బహుమతి సాధించాయి. వాలీబాల్‌లో పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ మొదటి బహుమతి, జీ.మల్కాపురం జెడ్పీహెచ్‌ఎస్ రెండవ బహుమతి పొందాయి. అండర్-17 బాలుర కబడ్డీలో అనాజిపురం టీజీఎమ్‌ఎస్ మొదటి బహుమతి, అనంతారం జెడ్పీహెచ్‌ఎస్ రెండవ బహుమతి సాధించాయి. ఖో-ఖోలో అనాజిపురం టీజీఎమ్‌ఎస్ మొదటి బహుమతి, అనంతారం జెడ్పీహెచ్‌ఎస్ రెండవ బహుమతి కైవసం చేసుకున్నాయి.వాలీబాల్‌లో గాజులమల్కాపురం జెడ్పీహెచ్‌ఎస్ మొదటి బహుమతి సాధించగా, అనాజిపురం టీజీఎమ్‌ఎస్ రెండవ బహుమతితో సరిపెట్టుకుంది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి శోభ, జీహెచ్‌ఎం అంజయ్య, పల్స వెంకన్న, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

## - డీజేలకు అనుమతి లేదు..నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## - సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహా





**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు ముందస్తు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె.నరసింహా ఆదేశించారు.శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సూర్యాపేట డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు,దర్యాప్తు పురోగతి,కేసుల ఆన్‌లైన్ నమోదు,ఈ-సాక్షి నమోదు,కేసుల దాఖలు, పెండింగ్ కేసుల పరిష్కారం తదితర అంశాలపై ఎస్పీ సమీక్షించారు.కేసులు, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు.మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణ,సైబర్ మోసాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నమోదైన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత సమయంలో నాణ్యమైన ఛార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు.

**గణేశ్ ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి**

రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పోలీసు అధికారులు ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. గణేశ్ మండపాల ఆన్‌లైన్ నమోదు, మండపాల వద్ద నిత్యం పర్యవేక్షణ, భద్రతా చర్యల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలన్నారు. గణేశ్ విగ్రహాల శోభాయాత్రలు, నిమజ్జనాలకు సంబంధించి మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, నిమజ్జన ప్రాంతాల్లో భద్రత తదితర అంశాలపై ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు.ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు, భక్తులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకునేలా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఫింగర్‌ప్రింట్ ఇన్‌స్పెక్టర్ నవీన్, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మస్తాన్ అలీ, సీఐలు రాజశేఖర్, వెంకటయ్య, డివిజన్ ఎస్ఐలు, డీసీఆర్‌బీ ఎస్ఐలు, షీ టీం, భరోసా సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# మిల్లర్ల సమస్యలు పరిష్కరించకపోతే సీఎంఆర్ నిలిపివేస్తాం

## -11వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ నిలిపివేతకు నిర్ణయం

## - రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంపటి మధుసూదన్

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**

రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే ఈ నెల 11వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ కార్యక్రమాన్ని నిలిపివేస్తామని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంపటి మధుసూదన్, బీసీ ఉద్యమ నాయకుడు వట్టె జానయ్య యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట మిల్లర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్లర్ల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల బియ్యం రాబడి ప్రస్తుతం సాధ్యం కావడం లేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 60 కిలోల బియ్యం కూడా రావడం లేదని, రబీ సీజన్‌లో 50 కిలోలలోపే రాబడి వస్తోందని తెలిపారు. పరీక్ష మిల్లింగ్ నిర్వహించి వాస్తవంగా ఎంత బియ్యం రాబడి వస్తుందో అంతే ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.మిల్లుల సామర్థ్యానికి మించి రెండు, మూడు రెట్ల ధాన్యాన్ని కేటాయించడం వల్ల నిల్వలు,లోటు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగానే ధాన్యం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.మిల్లర్ల సమస్యలను 2015లోనే అప్పటి పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో పాటు ప్రస్తుత పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.నిఘా అధికారులు మిల్లర్లను అనుమానితులుగా చూస్తూ మొత్తం మిల్లింగ్ వ్యవస్థను దోషిగా చిత్రీకరించడం సరికాదన్నారు.గత సీజన్‌లో భారీగా ధాన్యం వచ్చిన సమయంలో రైతుల నుంచి ధాన్యం సేకరించి మిల్లింగ్ చేయడం ద్వారా మిల్లర్లు రైతులకు అండగా నిలిచారని గుర్తుచేశారు.క్వింటాల్‌కు 67 కిలోల బియ్యం తప్పనిసరిగా ఇవ్వాలనే నిబంధనను ప్రభుత్వం పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే మిల్లర్లతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 11వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సీఎంఆర్ నిలిపివేత నిర్ణయాన్ని అమలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జయప్రకాష్, కోదాడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి బ్రహ్మ, ప్రధాన కార్యదర్శి కొత్త బ్రహ్మయ్య, హుజూర్‌నగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొలిశెట్టి నరసింహారావు, సూర్యాపేట ప్రధాన కార్యదర్శి కొత్త ఆంజనేయులు, కోశాధికారి అశ్విని కుమార్, జిల్లా కార్యదర్శి కాసం జగన్, కొండమీది గోవిందరావు, వంగవీటి నాగరాజు, సత్యనారాయణ, నరసింహారెడ్డి, అనంత రాములు, బచ్చు ఉపేందర్, నరేందర్, నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

## బీజేపీ వేములపల్లి మండల శాఖ డిమాండ్





**వేములపల్లి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):-**

రైతులకు 24 గంటల విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని బీజేపీ వేములపల్లి మండల శాఖ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వేములపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ ఏఈ కార్యాలయంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అతికించారు. అలాగే రైతుల కేబుల్ వైర్ల దొంగతనాలపై నిఘా పెంచాలని కోరుతూ మండల ఎస్సై వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెదమం భరత్ మాట్లాడుతూ.. విద్యుత్ కోతల కారణంగా పంట పొలాలకు, ఇరిగేషన్ లిఫ్ట్‌లకు సక్రమంగా విద్యుత్ అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులకు కనీసం పూర్తిస్థాయిలో 10 గంటల విద్యుత్ కూడా అందడం లేదని ఆరోపించారు.మండల విద్యుత్ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో కూడా సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో వినతిపత్రాన్ని కార్యాలయానికి అతికించాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా సామామూర్తి, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చల్లమల్ల సీతారాం రెడ్డి, సత్యనారాయణ, పెదమం వెంకన్న, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి పందిరి భాగ్యమ్మ, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బుల్లెద్దు లవయ్య, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మల జాన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు పెదమం ప్రసాద్, పగిడిపల్లి సోమయ్య, యువ నాయకులు ఇరుగు దిండ్ల నరేష్, పేరం విలేకర్, ఆలకుంట్ల మధు, బూత్ అధ్యక్షులు కేతనపల్లి భూపాల్ రెడ్డి, కోట్ల శంకర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, మహేష్, శేఖర్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.